News Daily

ఎడిటర్ :

B. ఉపేందర్

cknews7484@gmail.com

Visit in :
www.cknewstv.in

CK
చంద్ర కాంత్

NEWS

తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :285 | ఖమ్మం | సోమవారం, నవంబర్ 16, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



కొత్త పింఛన్లు 4.63 లక్షలు

- లబ్ధిదారుల్లో అత్యధికంగా వితంతువులు 2.77లక్షలు, దివ్యాంగులు లక్ష మంది
- ఈ నెల 19న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమకు ప్రభుత్వం ఏర్పాట్లు
- ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నగదు బదిలీకి శ్రీకారం

హైదరాబాద్

చేయూత సామాజిక పింఛన్ పథకం ఆశావహులకు శుభవార్త. కార్యాలయాల్లో ఏళ్లుగా నిరీక్షిస్తున్న 'చేయూత' దరఖాస్తులకు ప్రభుత్వం మోక్షం కల్పించింది. రాష్ట్రంలో కొత్తగా 4,63,857 మందికి పింఛన్లు మంజూరు చేసింది. ఈ నెల 19న పింఛన్ సొమ్మును లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనుంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నగదు బదిలీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కొత్త పింఛన్ల నగదు బదిలీకి ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఇందుకు అవసరమైన అదనపు బడ్జెట్‌ను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. నగదు బదిలీ ప్రక్రియను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ యంత్రాంగం పర్యవేక్షిస్తోంది. వితంతువులే అత్యధికం: కొత్తగా పింఛన్లు మంజూరైన వారిలో వితంతువులు సగానికి పైగా ఉన్నారు. వివరాలు 2లో..

ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలి

- రూ.30 వేల కోట్లు ఇవ్వండి
- కరువును అధిగమించేందుకు ప్రత్యేక ఆర్థిక సాయం చేయండి
- ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- రాష్ట్రంలో 365 మండలాల్లో కరువు పరిస్థితులు
- పంటలు నష్టపోయిన రైతన్నలను ఆదుకోవడానికి, గ్రామీణ ఉపాధిని పెంచడానికి సహకరించాలి
- రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి, అనుమతుల విషయంలో చొరవ చూపండి
- తుమ్మిడిహెట్టి నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించండి
- సమ్మక్క--సారలమ్మ బరాజ్‌కు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ ఇప్పించండి
- ఎఫ్‌ఆర్‌బీఎం రుణ పరిమితిని 3.5 శాతానికి పెంచాలన్న సీఎం
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు, ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు రావాలంటూ ఆహ్వానం



న్యూఢిల్లీ

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను అధిగమించేందుకు తక్షణమే రూ.30 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు వచ్చేలా చూడాలని, అంతరాష్ట్ర వివాదాల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. న్యూఢిల్లీలో 7, లోక్ వివరాలు 2లో..




మోదీపై అవినీతి మరక లేదు!

- కాంగ్రెస్‌పై అమిత్‌షా నిప్పులు..
- 12 లక్షల కోట్ల కుంభకోణాలంటూ ఆరోపణలు
- 12 ఏళ్ల పాలనలో నాలుగు అణాల అవినీతి ఆరోపణ కూడా లేదు
- రాహుల్‌కు అధికారం కావాలంటే గ్రామాల్లో పర్యటించాలి
- భారత్ సమిట్ వ్యాఖ్యలపై బీజేపీ--కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం

ఏపీ, ఒడిశాలకు తుపాను హెచ్చరికలు జారీ..

- బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడనున్న వాయుగుండం
- గురువారం నాటికి ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుకునే అవకాశం
- ఉత్తరాంధ్ర జిల్లాల్లో గురు, శుక్రవారాల్లో భారీ వర్షాల సూచన
- కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారుల హెచ్చరిక





శ్రీవారి భక్తులకు ఎస్వీ మ్యూజియం ఎంట్రీ

- ప్రత్యేక ఆకర్షణగా 'బ్రహ్మాండం గ్యాలరీ'
- లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక ఎస్వీ మ్యూజియం
- టీసీఎస్ సాంకేతిక సహకారంతో 14 ప్రత్యేక గ్యాలరీలు
- నవంబర్ 16 నుంచి సాధారణ భక్తులకు సందర్శన అవకాశం
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి
- ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి 50 రూపాయలు మాత్రమే



అయ్యప్ప భక్తులకు శుభవార్త..

తెలుగు రాష్ట్రాల నుంచి కొల్లాంకు ప్రత్యేక రైళ్లు

నెహ్రూ వారసత్వాన్ని చెరిపేయడం సాధ్యం కాదు!

- బీజేపీ, ఆరెస్సెస్‌పై కాంగ్రెస్ ధ్వజం
- నెహ్రూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి
- వాస్తవాలు, విజ్ఞానంతో దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ప్రధాని మోదీనే అతిపెద్ద చరిత్ర వక్రీకర్త.. జైరాం రమేశ్ వ్యాఖ్యలు





పేదల బియ్యంపై దళారుల కన్ను!

రేషన్ పంపిణీ మొదలవగానే రంగంలోకి అక్రమ వ్యాపారులు

కిలో రూ.18కు కొనుగోలు.. రూ.24కు హోల్‌సేల్ విక్రయాలు

వేకువజామునే రహస్యంగా తరలింపు.. ఇతర రాష్ట్రాలకు సరఫరా

డీలర్ల పాత్రపైనా అనుమానాలు.. అధికారుల నిఘా ఏది?

కాసుల కోసమే సి-సెక్షన్

- అవసరం కన్నా ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా సిజేరియన్లు
- రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏకంగా 83.9 శాతం
- ఏడు జిల్లాల్లో 90 శాతంపైనే..
- కామారెడ్డిలో అత్యధికంగా 95.2 శాతం
- తెలంగాణలో దేశంలోనే అత్యధికంగా 62.2 శాతం సి--సెక్షన్లు..
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగ్గిపోతున్న ప్రసవాలు
- వైద్యులు, సిబ్బంది కొరత, ప్రసూతి సేవల్లో సమస్యలే కారణం!



హైదరాబాద్

నెలలు నిండిన గర్భిణుల్లో సాధారణ కాన్పుకు అవకాశం ఉన్నా.. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే నిజేరియన్ అంటున్నారా? గర్భిణి పరిస్థితి, ఆరోగ్యం కంటే ఆసుపత్రుల ఆర్థిక ప్రయోజనాలే ప్రధానంగా మారుతున్నాయా? రాష్ట్రంలో నిజేరియన్ ప్రసవాల గణాంకాలు చూస్తే ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలో అన్ని ఆస్పత్రుల్లో కలిపి 62.2 శాతం ప్రసవాలు శస్త్రచికిత్స ద్వారానే జరుగుతుండటం, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ రేటు ఏకంగా 83.9 శాతానికి చేరడం ఈ అనుమానాలను బలపరుస్తోంది. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లిన ప్రతి 10 మంది గర్భిణుల్లో దాదాపు 8 మందికి కడుపు కోసి బిడ్డను బయటకు తీస్తుండటం విస్మయపరుస్తోంది. ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించి, సాధారణ కాన్పుల సంఖ్యను పెంచేందుకు కొంత మేర కృషి జరిగినా.. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం వివరాలు 2లో..

ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలి

-మొదటిపేజీ తరువాయి

కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని అధికారిక నివాసంలో ఆయనతో రేవంత్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, రాష్ట్ర నీతిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానిని వారు సత్కరించారు. గంటకు పైగా జరిగిన సమావేశంలో రాష్ట్రంలో కరువు పరిస్థితులు, ప్రాజెక్టులు, ఇతర అంశాల గురించి ప్రధానికి సీఎం వివరించారు.

తక్షణమే స్పందించండి..

'కరువు పరిస్థితుల్లో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్రం తక్షణమే స్పందించాలి. కరువు సహాయక చర్యల కోసం రూ.30 వేల కోట్ల నిధులు ఇవ్వాలి. రాష్ట్ర ఎఫ్‌ఆర్‌బీఎం రుణ పరిమితిని 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి. యాసంగి అవసరాల దృష్ట్యా 1,500 మెగావాట్ల అదనపు విద్యుత్ ఇవ్వడంతో పాటు రైతులకు సరిపడా ఎరువులను సకాలంలో కేటాయించాలి. గ్రామీణ వలసలను నివారించేందుకు ఉపాధి హామీ (వీబీజీ రాంజీ) పథకం కింద అదనంగా 50 పని దినాలను కల్పించాలి..' అని సీఎం కోరారు.

తుమ్మిడిహెట్టి ముంపు పరిహారం చెల్లించేందుకు సిద్ధం

ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించండి. (ఇటీవల మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో భేటీ అయిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు) ముంపు పరిహారం చెల్లించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో వెనుకబడిన, గిరిజన ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలకు గ్రావిటీ ద్వారా నీటిని అందించే అవకాశం కలుగుతుంది. సమ్మక్క--సారక్క బరాజ్ ప్రాజెక్టుకు సంబంధించి ఛత్తీస్‌గఢ్‌లో ముంపు సర్వే కోసం ఇప్పటికే రూ.9.88 కోట్లు చెల్లించాం. ఆ రాష్ట్రం నుంచి త్వరగా ఎన్ఓసీ జారీ అయ్యేలా చొరవ తీసుకోండి. సీడబ్ల్యూసీ అనుమతులు కూడా వచ్చేలా చూడండి.

పెండింగ్‌లో అనుమతులు

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), సీతమ్మ సాగర్ ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్) కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే భారీగా వ్యయం చేసింది. అయినా ఇప్పటికీ పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి. పర్యావరణ అనుమతుల విషయమై ఇటీపల సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇచి?చస నేపథ్యంలో, ఆయా ప్రాజెక్టులకు సత్వరమే అనుమతులు ఇప్పించాలి.



పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి. లేదా తగిన ఆర్థిక సాయం అందించాలి.

'ఇందిరమ్మ'కు, మెట్రోకు నిధులు కేటాయించండి

రాష్ట్రంలో 70 నుంచి 90 శాతం పూర్తయిన ప్రాజెక్టుల కోసం రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక సాయం పథకం (సాస్మీ) కింద అదనంగా రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలి. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) కింద ఇంటిగ్రేటెడ్ సమ్మక్క సాగర్--సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోదికుంట వాగు ప్రాజెక్టుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకా--కొరాటా బరాజ్‌కు రూ.103 కోట్లు మంజూరు చేయాలి. సమక్క--సారక్క ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇప్పటికే సీడబ్ల్యూసీకి సమరి?పంచాం. ఈ ప్రాజెక్టుతో ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూమి తదితర అంశాలపై సమగ్ర సర్వే కోసం రూ.9.88 కోట్లు చెల్లించాం. ముంపు, నిర్వాసితులకు సంబంధించిన పరిహారం ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అదనపు నిధులు కేటాయించాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టుకు కేంద్రం తరపున రుణ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ రండి..

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ -- 2026', 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్' సంబంధిత కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా ప్రధానిని సీఎం ఆహ్వానించారు. ఖేలో ఇండియా క్రీడలు డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. ఈ క్రీడల ప్రారంభ, ముగింపు వేడుకలకు రావాలని పీఎంను కోరారు. అలాగే డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ (భారత్ ఫ్యూచర్ సిటీ) వేదికగా జరగనున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు ప్రారంకోత్సవానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఖేలో ఇండియా లోగో, మస్కట్ ఆవిష్కరణ

ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అధికారిక నివాసంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనతో కలిసి ఖేలో ఇండియా క్రీడల అధికారిక లోగో, మస్కట్‌లను ఆవిష్కరించారు. హైదరాబాద్ సహా వివిధ జిల్లా కేంద్రాల్లో జరగనున్న ఈ క్రీడలకు సంబంధించిన వేదికల అభివృద్ధి, నిధుల విడుదలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీబాలా దేవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు 4.63 లక్షలు



-మొదటిపేజీ తరువాయి

మొత్తంగా 4,63,857 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు కాగా, వారిలో వితంతువులు 2,77,894 మంది, దివ్యాంగులు 1,00,224 మంది, ఒంటరి మహిళలు 53,844 మంది, గీత కార్మికులు 27,444 మంది, చేనేత కార్మికులు 4,451 మంది ఉన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖుల చేతుల మీదుగా ఈ పత్రాలను అందజేస్తున్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

అర్హులైన పేదలు, మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్లను ఎలాంటి జాప్యం లేకుండా అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ నెల 19న లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కానుండటంతో కొత్తగా పింఛన్లు పొందుతున్న 4.63 లక్షల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుందని, మంజూరు పత్రాల పంపిణీతో పాటు నగదు బదిలీని కూడా నిరీ?ణత తేదీనే పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ కూలీ నుంచి పోలీస్ ఉన్నతాధికారిగా..

ములుగు: పట్టుదల ఉంటే పేదరికం ప్రగతికి అడ్డుకాదని నిరూపించారు ములుగు జిల్లావాసి, తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ డి.రమేశ్. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, వృత్తి నైపుణ్యం, దేశ భద్రతకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న ఆయనకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన అతి ఉత్కృష్ట సేవా పతకం--2026 ప్రకటించింది.

ఎస్సై నుంచి అంచలంచెలుగా ఎదిగి..

ములుగు జిల్లా వెంకటాపూర్ (ఎం) మండల కేంద్రంలోని పేద కుటుంబానికి చెందిన దండుగుడు గౌరి లక్ష్మి, మల్లయ్యకు కుమారుడు రమేశ వ్యవసాయ కూలీగా జీవితం ప్రారంభించారు. ప్రైవేట్ టీచర్‌గా, ఆర్ఎంపీగా, ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా, న్యూస్ రిపోర్టర్‌గా, లైబ్రరీ అసిస్టెంట్‌గా, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసినా సంతృప్తి చెందలేదు. జీవితంలో ఏదైనా సాధించాలనే సంకల్పంతో 1995లో పోలీస్‌శాఖలో ఎస్సైగా కొలువుకొట్టిన ఆయన అంచలంచెలుగా ఎదిగి ఎస్పీ స్థాయికి చేరుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇంటెలిజెన్స్ విభాగంలో ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

105 ప్రశంస పత్రాలు.. పలు పతకాలు.

తన సుదీర్ఘ పోలీస్ ప్రస్థానంలో ఎస్పీ రమేశ్ ఇప్పటివరకు 105 ప్రశంసపత్రాలు, సేవా పతకాలు అందుకున్నారు. 2010లో ముఖ్యమంత్రి శౌర్య పతకం, 2018లో తెలంగాణ పోలీసు సేవా పతకం, 2024లో ఇండియన్ పోలీస్ మెడల్ పతకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. తాజాగా అతి ఉత్కృష్ట సేవా పతకం ఆయన కీర్తి కిరీటంలో మరో జాతీయ గౌరవంగా చేరింది. 2022 నవంబర్‌లో అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో నిర్వహించిన ప్రపంచ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ సదస్సులో పాల్గొనడం ఆయన వృత్తి ప్రస్థానంలో మరో మైలురాయి.

కాసుల కోసమే సి-సెక్షన్

-మొదటిపేజీ తరువాయి


చేయించుకుంటే గతంలో లభించే ఆర్థిక ప్రయోజనం, ప్రోత్సాహకాలు ఇప్పుడు లేకపోవడంతో వ్యయ ప్రయాసల కోర్చి అయినా గర్భిణులు ప్రైవేటునే ఆశ్రయిస్తున్నారు. దీనికి తోడు క్షేత్రస్థాయిలో గర్భిణులకు వైద్య సేవలు అందించాల్సిన పీహెచ్‌సీ, యూహెచ్‌సీ సిబ్బంది కొందరు ప్రైవేటు నర్సింగ్ హోంలకు సిఫారసు చేస్తున్నారన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఇలా వచ్చేవారితో పాటు నేరుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరే వారికి కూడా ఎంతవరకు అవసరం అనేది చూడకుండా ఎడాపెడా సిజేరియన్లు చేసేస్తున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య తగ్గుతుండగా..ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పులు గణనీయంగా పెరుగుతున్నాయి.

ప్రభుత్వ దవాఖానాల్లో ఇలా..

ఎంసీహెచ్ కిట్ పోర్టల్‌లో నమోదైన వార్షిక వివరాల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల వాటా 2022--23లో 53.97 శాతం ఉండగా, 2023--24లో 50.81 శాతానికి, 2024--25లో 47.20 శాతానికి పడిపోయింది. అంటే 2024--25లో ప్రైవేటు, ఇతర వైద్య కేంద్రాల్లోనే 52.80 శాతం ప్రసవాలు జరిగాయి. 2025--26లో ప్రభుత్వ ఆసుపత్రుల వాటా స్వల్పంగా పెరిగి 49.85 శాతానికి చేరింది. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత, ప్రసూతి సేవల అందుబాటులో సమస్యలు వంటి అంశాలు కూడా గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రుల వైపు వెళ్లడానికి కారణమవుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గర్భం దాల్చిన నాటి నుంచి పీహెచ్‌సీలకు వచ్చే మహిళలు తీరా కాన్పు సమయంలో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నట్లు తేలింది. పీహెచ్‌సీలలోని వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పు చేయించేలా ప్రోత్సహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కామారెడ్డిలో కోసేస్తున్నారు..!

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే--6 (2023--24) ప్రకారం తెలంగాణలో మొత్తం సిజేరియన్ రేటు 62.2 శాతం. జాతీయ సగటు 27.2 శాతంతో పోలిస్తే రెండింతలకుపైగా ఉంది. గత సర్వేలో 60.7 శాతంగా ఉన్న రేటు మరింత పెరిగింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో 83.9 శాతం ప్రసవాలు సిజేరియన్లే కాగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ 48.1 శాతం నమోదయ్యాయి. ఏడు జిల్లాల్లో ప్రైవేటు ఆసుపత్రుల సిజేరియన్ రేటు 90 శాతం దాటింది. కామారెడ్డిలో



అత్యధికంగా 95.2 శాతం, కరీంనగర్‌లో 93.6 , ఆదిలాబాద్‌లో 93.4, మంచిర్యాలలో 92.4, ఖమ్మంలో 90.8, రాజన్న సిరిసిల్లలో 90.7, సిద్దిపేటలో 90.1 శాతంగా ఉంది. ఇక రాజన్న సిరిసిల్లలో 82 శాతం, జగిత్యాలలో 81, కరీంనగర్‌లో 79.9 శాతం ప్రసవాలు శస్త్రచికిత్సల ద్వారానే జరుగుతుండడం ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతున్న సీజేరియన్ల తీరుకు అద్దం పడుతుంది.

కాసుల కోసమే సి--సెక్షన్

ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యేంత వరకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స చేయించుకుంటే రూపాయి ఖర్చు ఉండదు. కానీ ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పులకు ఆయా ఆసుపత్రిని బట్టి పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారు. గర్భిణికి 9 నెలలు నిండిన తరువాత కాన్పు విషయంలో అనేక ప్రైవేటు ఆసుపత్రులు మహిళలను సిజేరియన్‌కే ఒప్పించే ప్రయత్నం చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుకు రూ.50 వేల లోపు ఖర్చయితే.. సిజేరియన్ (సి--సెక్షన్) ఆపరేషన్‌కు సుమారు రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు, కొన్నిచోట్ల అంతకుమించి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కార్పొరేట్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో గది రకం, వైద్యుల ఫీజు, చికిత్స సంక్లిష్టతను బట్టి బిల్లు రూ.2 లక్షలు దాటుతున్నట్లు తెలుస్తోంది.

అవసరం లేని ఆపరేషన్లపై నిఘా ఏదీ?

సిజేరియన్ అనేది అవసరమైనప్పుడు తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడే అత్యంత కీలకమైన వైద్య ప్రక్రియ. కానీ అవసరం లేకుండా చేస్తే తల్లులకు ఇన్ఫెక్షన్లు, అధిక రక్తస్రావం, కోలుకోవడంలో జాప్యం, తదుపరి గర్భధారణల్లో సమస్యలు తలెత్తవచ్చు. శిశువుల్లోనూ శ్వాస సంబంధిత సమస్యల ముప్పు పెరుగుతుంది. అయితే వీటన్నిటిపై సరైన నిఘా వ్యవస్థ లేకపోవడం గమనార్హం. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రతి సిజేరియన్‌కు గల వైద్య కారణాలను పరిశీలించడం, ఆసుపత్రుల వారీగా ఆపరేషన్లపై ఆడిట్ నిర్వహించడం, సాధారణ కాన్పులకు ప్రోత్సాహకాలు పునరుద్ధరించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి సేవలను బలోపేతం చేయడం తక్షణావసరం అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అవసరం లేకపోయినా శస్త్రచికిత్సలకు మొగ్గు చూపే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ విని?పస్తోంది.

పేదల బియ్యంపై దళారుల కన్ను!

తెలంగాణ: పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులకు ఆదాయ వనరుగా మారుతోంది. రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ ప్రారంభం కాగానే దళారులు గ్రామాల్లో ప్రత్యక్షమవుతున్నారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, పెద్ద వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఈ వ్యవహారం విస్తరిస్తున్నా పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదు. అప్పుడప్పుడు అధికారులు దాడులు చేసి బియ్యాన్ని పట్టుకుంటున్నప్పటికీ, కొద్దిరోజులకే వ్యాపారం తిరిగి మొదలవుతుండటం గమనార్హం.

పంపిణీ మొదలైతే చాలు.. ఏజెంట్లు ప్రత్యక్షం!

రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ ప్రారంభమైన వెంటనే దళారుల ఏజెంట్లు గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నారు. ఏ లబ్ధిదారులు బియ్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారో ముందుగానే సమాచారం సేకరించి వారి ఇళ్ల వద్దకే వెళ్తున్నారు. కిలోకు రూ.18 చొప్పున నగదు చెల్లించి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని తూకం వేసి రంగు సంచుల్లో నింపి ఇళ్ల వద్దే ఉంచి వెళ్లిపోతున్నారు. ఈ వ్యవహారం ముందస్తు ప్రణాళికతో సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెల్లవారుజామునే రహస్య రవాణా

బియ్యం సేకరణ పూర్తయిన తర్వాత అసలు దందా మొదలవుతోంది. తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల మధ్య ద్విచక్రవాహనాలపై బియ్యం సంచులను రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఒక్కో విడతలో 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు బియ్యాన్ని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం కిలో రూ.22 నుంచి రూ.24 చొప్పున పెద్ద దళారులకు విక్రయిస్తున్నారు. అక్కడి నుంచి రాత్రివేళల్లో పెద్ద వాహనాల ద్వారా రైస్ మిల్లులకు, ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

డీలర్ల పాత్రపైనా అనుమానాలు

ఈ అక్రమ వ్యాపారంలో కొందరు రేషన్ డీలర్ల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లబ్ధిదారులకు నగదు చెల్లించి బియ్యాన్ని తమ వద్దే నిల్వ చేసుకుని, అనంతరం దళారులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవాలను అధికారులు విచారణ ద్వారా నిర్ధారించాల్సి ఉంది. రేషన్ దుకాణాల నుంచి బియ్యం పంపిణీ అయిన తర్వాత దాని పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

కామారెడ్డిలో 40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కామారెడ్డి జిల్లాలో జరిగిన ఘటన ఉదాహరణగా నిలుస్తోంది. కామారెడ్డి మండలం టేక్రియాల్ వద్ద పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. స్థానిక దళారులతో పాటు మహారాష్ట్రకు చెందిన వ్యాపారి బియ్యాన్ని సేకరించి వాహనాల్లో తరలిస్తుండగా అధికారులు గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనర్హులుగా గుర్తించిన రేషన్ కార్డుల విషయంలోనూ పారదర్శకత అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 6,250 మంది రేషన్ కార్డుల రద్దుకు సంబంధించిన వ్యవహారంలోనూ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రద్దయిన కార్డులపై ఇంకా లావాదేవీలు జరుగుతున్నాయా? బయోమెట్రిక్ విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారా? అనే అంశాలపై పౌరసరఫరాల శాఖ సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం పేదల కోసం కేటాయిస్తున్న ఉచిత బియ్యం నిజమైన లబ్ధిదారులకు చేరి వారి ఆహార భద్రతకు ఉపయోగపడాలి. కానీ మధ్యలో దళారులు ప్రవేశించి బియ్యాన్ని వ్యాపార సరుకుగా మార్చడం ఆందోళన కలిగిస్తోంది. రేషన్ దుకాణాల నుంచి బియ్యం పంపిణీ మొదలుకొని, నిల్వలు, రవాణా, మిల్లుల వరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. అక్రమంగా బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తులు, నిల్వ చేస్తున్న వ్యాపారులు, రవాణా చేస్తున్న ముఠాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

దాసరిపల్లి సర్పంచ్‌పై దాడి కలకలం.. ఏడుగురిపై ఆరోపణలు!

- సంతకాల ఫోర్జరీ వివాదమే దాడికి కారణమా? పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ బోయ వెంకటేష్..



మల్దకల్, నవంబర్ 15: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం దాసరిపల్లి గ్రామ సర్పంచ్ బోయ వెంకటేష్‌పై దాడి జరిగినట్లు ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అదే గ్రామానికి చెందిన మహేంద్ర అనే వ్యక్తి మున్సిపాలిటీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. సర్పంచ్ బోయ వెంకటేష్‌కు సంబంధించిన సంతకాలను మహేంద్ర ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు ఉండగా, ఈ వ్యవహారమే ఇరువురి మధ్య వివాదానికి కారణమైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మహేంద్రతో పాటు మరో ఏడుగురు తనపై దాడి చేసినట్లు బాధిత సర్పంచ్ ఆరోపించారు.శనివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో బిజ్వారం నుంచి తన స్వగ్రామమైన దాసరిపల్లికి వెళ్తుండగా మార్గమధ్యంలోని దొరబాయి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెంకటేష్ తెలిపారు. దాడిలో గాయపడిన ఆయన ప్రస్తుతం గద్వాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

బాధితుడికి నేతల పరామర్శ

సర్పంచ్ వెంకటేష్‌పై దాడి జరిగిన విషయం తెలుసుకున్న మల్దకల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, అమరవాయి గ్రామానికి చెందిన తూమ్ కృష్ణారెడ్డి, దాసరిపల్లి మాజీ సర్పంచ్ భరత్ రెడ్డి గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాప్రతినిధిగా ఉన్న సర్పంచ్‌పైనే దాడి జరగడం ఆందోళనకరమని వారు పేర్కొన్నారు. సంతకాల ఫోర్జరీ ఆరోపణలతో పాటు దాడి ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత సర్పంచ్‌కు న్యాయం జరిగే వరకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

30 పోలీస్ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించిన 20 మందిపై కేసు నమోదు

- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా దిష్టిబొమ్మ దహనం
- ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- అనుమతులు లేకుండా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తే చర్యలు తప్పవు -- వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్



సికె.న్యూస్.ఆదిలాబాద్30 పోలీస్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిబంధనలకు విరుద్ధంగా దిష్టిబొమ్మ దహనం చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన 20 మందిపై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ తెలిపారు.ఈరోజు ఉదయం అనుమతులు లేకుండా దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించి శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యల్లో భాగంగా 30 పోలీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేసు నమోదైన వారిలో కొందరి వివరాలు:

1. పతంగి బ్రహ్మానంద్
2. సందీప్ తక్రే, బేల
3. శైలేంద్ర వాగ్మారే
4. దత్త నికం, బేల
5. ఆమ్టే మాధవరావు, ఇచ్చోడ
6. పాండు, ఇచ్చోడ
7. సత్యప్రకాశ్, ఇచ్చోడ
8. శుభాష్ పటేల్, జామిడి
9. గేడం శివ, రాంనగర్, ఆదిలాబాద్
10. రమేష్ సోనార్, ఇచ్చోడ
11. తులసి రామ్, చించోలి, ఇచ్చోడ

వీరితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు:

30 పోలీస్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ హెచ్చరించారు.

జిల్లా వ్యాప్తంగా డీఎస్పీ స్థాయి అధికారి అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదని, ప్రజలు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని తెలిపారు.

రామభక్త సీతయ్య కళాపరిషత్‌శ్రీ లో అమ్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి మల్లు నందిని విక్రమార్క

మధిర నవంబర్ 15(సికె న్యూస్). మధిర వారి,28వ జాతీయస్థాయి మధిర బాలోత్సవ్ పోటీలలో,రెండవ రోజుపోటీలను(ప్రారంభించడానికి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి మల్లు నందిని మేడం విచ్చేశారు.జ్యోతి ప్రజ్వలన అనంతరంవారుమాట్లాడుతూ... చిన్నతనంనుండివిద్యార్థులలోని టాలెంటును గుర్తించి, దానికి మెరుగులు దిద్దితే వారు భవిష్యత్తులో మంచిగా రాణిస్తారు. ఆటపాటలతో పాటు చదువుకున్న విద్యార్థులు, ఎల్లప్పుడూ చురుకుగా ఉండి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదుగుతారు. రామభక్త సీతయ్య కళాపరిషత్ వారు గత 28 సంవత్సరాలుగా పిల్లల్ని ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నారు. చిన్నతనంలోనే పిల్లల్ని కళల పట్ల అభిరుచి నాటే కార్యక్రమాన్ని సీతయ్య కుటుంబ సభ్యులు పాటుపడుతున్నారు. వారందరికీ శు భాకాంక్షలు. ఈకార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు శ్రీకృష్ణప్రసాద్,సెక్రటరీ మధిర బాబ్లా,కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షులుపారుపల్లివిజయకుమార్, టౌన్ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు, టీవీ రెడ్డి,రంగా శ్రీనివాసరావు, మహిళా విభాగం నుండి వనజ పాల్గొన్నారు. ఈరోజు పోటీలు నీ సత్తా



చాటుకు ఏకపాత్రలు నీతి పద్యాలు విచిత్ర వేషాలు అన్ని విభాగాల నుండి 160 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా పాకాల పాటి రోశయ్య చౌదరి, చెన్నారావు వ్యవహరించారు.



సికె.న్యూస్.బోథ్:చింతల సాంగ్వీ గ్రామంలో బీర్సముండ 151 వ జయంతి ఘనంగా జరుపుకున్నారు .బ్రిటిష్ పాలన మరియు స్థానిక జమిందార్ల దోపిడికి వ్యతిరేకంగా 'ఉల్గులన్ 'అనే మహా తిరుగుబాటు అనే గిరిజన పోరాటాన్ని నడిపాడు గిరిజన హక్కులు జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన గోప్ప ఆదివాసి స్వతంత్ర పోరాట యోధుడు .భారత పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో చిత్రపటం ఉన్న ఏకైక ఆదివాసి నాయకుడు . అయిన చేసిన పోరాటాలు గుర్తు చేస్తు పులమళ వేసి నివాలి అర్పించారు .కార్యక్రమంలో పటేల్ .భీం రావ్ ,దేవారి .లక్ష్మన్ ,మహాజన్ .హన్మంతు సర్పంచ్. పద్మలత జగదిష్ ఆదివాసి యుత్ అధ్యక్షులు సిడం .సుబష్ ,నాందేవ్ ,గంగారాం,రామకృష్ణ ,సచిన్ ,మోలంతి ,రవి తదితరులు పాల్గొన్నారు

ఆత్మగౌరవంతో ఆకాశమంత ఎత్తుకు ఎదగాలి



విద్య, ఆరోగ్యంతోనే బంగారు భవిష్యత్తు

స్వేరోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొండ్రు రామచంద్రు


సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.విద్య ద్వారానే సమాజంలో ఆత్మగౌరవం, ఉన్నతమైన గుర్తింపు లభిస్తాయని స్వేరోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొండ్రు రామచంద్రు పేర్కొన్నారు. మండలంలోని తిరుమలాపురంలో శనివారం సర్పంచి చాపలమడుగు వీరబాబు ఆధ్వర్యంలో 'స్వేరోస్ ప్రేరణ కార్యక్రమం' నిర్వహించారు. సర్పంచి నివాసంలో జరిగిన ఈ సభకు రామచంద్రు అధ్యక్షత వహించి మాట్లాడారు.మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ రూపకల్పన చేసిన 'స్వేరో' (గ్రాఔరాజు=గా) ఉద్యమ ఆశయాలను ఆయన వివరించారు. నిరుపేద, వెనుకబడిన వర్గాల పిల్లల్లోని న్యూనతా భావాన్ని తొలగించి, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఆర్థిక సాధికారత అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన స్వేరో విద్యార్థులు పూర్ణ, ఆనంద్‌లను ఆదర్శంగా తీసుకొని, స్వేరో 'పది సూత్రాలను' (టెన్ కమాండ్‌మెంట్స్) ఆచరిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం 'స్వేరో సర్కిల్స్' నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ చేయించి స్వేరోస్ జెండాను ఆవిష్కరించారు. 'విద్య, ఆరోగ్యం, సామాజిక చైతన్యం' నినాదాలతో గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచి వీరబాబు, స్వేరోస్ నాయకులు, విద్యార్థులు చాపల మడుగు సతీష్, కొమ్ము కార్తీక్, దారెల్లి దిలీప్ జోసఫ్ సిద్దు తదితరులు పాల్గొన్నారు.

కర్నాటి వారి ఆత్మీయ కలయికను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

మధిర నవంబర్ 15(సికె న్యూస్)నవంబర్ 15వ తేదీన నిర్వహించిన కర్నాటి వారి ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేసినందుకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో, విదేశాల్లో స్థిరపడిన కర్నాటి కుటుంబానికి చెందిన సోదర, సోదరీమణులందరూ ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, కొత్త పరిచయాలు ఏర్పరచుకుంటూ కుటుంబ బంధాలు, అనుబంధాలు మరింత బలోపేతం అయ్యాయని పేర్కొన్నారు. ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పెద్దలు, మహిళలు, యువత, ఆడపడుచులు, చిన్నారులు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు మరిన్ని నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.



అంగరంగ వైభవంగా జరిగిన రంగా హనుమంతరావు కుమారుని వివాహ మహోత్సవం



పద్మప్రియ దంపతుల కుమార్తె అనూష ల వివాహము మధిర మండలం దెందుకూరు ఎస్ఆర్ కన్వెన్షన్ నందు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీ శ్రీరామ్ తాతయ్య , మల్లు నందిని , తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ తిరుపతి భవన్ నిర్మాణ కమిటీ చైర్మన్, ఎస్ కే టి సంస్థల అధినేత శ్రీ దోసపాటి వెంకటేశ్వరరావు ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు శ్రీ వసుమర్తి చంద్రారావు , తదితర ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రముఖ కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి తప్పకుండా వస్తానని ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించటమే కాక తెలుగుదేశం పార్టీ, టిఆర్ఎస్ పార్టీ, మరియు కాంగ్రెస్ పార్టీ అతిరథ మహారథులందరితో గత 40 సంవత్సరాలుగా తనకున్న సాన్నిహిత్యంతో ఆత్మీయంగా పలకరించడం జరిగింది.తమ ఆహ్వానాన్ని మన్నించి ఈ కార్యక్రమానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించిన అందరికీ తమ కుటుంబ సభ్యులందరి తరపున రంగా హనుమంతరావు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

మధిర నవంబర్ 15(సికె న్యూస్)నవంబర్ 14 న మధిర లో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ప్రముఖ కాంగ్రెస్ నాయకులు, భట్టి విక్రమార్క ప్రియ శిష్యులు శ్రీ రంగా హనుమంతరావు, మధులత దంపతుల కుమారుడు రంగా రాహుల్ వివాహము అశ్వారావుపేటకు చెందిన దారా ప్రసాద్,

పేరు మార్పు ప్రకటన పేరు మార్పు.



సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు
నవంబర్ 15.తెలంగాణ రాష్ట్రం, యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన నేను నర్రా సతయ్య కుమారుడైన స్వామి సుక్క (పూర్వపు పేరు: నర్రా రవి) అను నేను, తప్పుడు నమోదుల కారణంగా నా పేరు మార్పు జరిగినట్లు తెలియజేస్తున్నాను. ఇకపై నా అసలు పేరు స్వామి సుక్కగా కాకుండా నర్రా రవిగా పిలువబడాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రికార్డులు మరియు ఇతర చట్టపరమైన అవసరాల కోసం నర్రా రవి అనే పేరును ఉపయోగించనున్నట్లు ఇందుమూలంగా తెలియజేస్తున్నాను.ఇది సంబంధిత వారందరి సమాచారార్థం ప్రచురించడమైనది.

నల్గొండ మహాసభలో మల్లారం ఐద్వా మహిళలు



మధిర నవంబర్ 15(సికె న్యూస్)మధిర నుండి నల్గొండఅఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలకు మల్లారం గ్రామం నుంచి ఐద్వా మహిళా సభ్యులు హాజరయ్యారు. గౌరరాజు ధనలక్ష్మి, ఎర్ర నాగుల సుజాత, సాంబ షేక్ నాగుల మేర, సంపసాల చంద్రకళ మెట్టెల బుజ్జితదితరులు సభలో పాల్గొన్నారు. రైతు, మహిళా సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగుతుందని వారు తెలిపారు.

సభా ప్రాంగణంలో ఎర్ర చీరలు ఎర్ర కండవాలు ఎర్రజెండాలతో సభా ప్రాంగణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది

మధిరలో వ్యవసాయ శాఖ మాత్యులుఘనంగా శ్రీ తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు



మధిర నవంబర్15(సికె న్యూస్)మధిర మండలం జిలుగుమాడు ఆదరణ ఫౌండేషన్ లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు జన్మదిన వేడుకలు శ్రీకృష్ణ ప్రసాద్ మొండితోక సుధాకర్ రావు మాదల రామారావు చెరుకూరి నాగార్జున లు ఘనంగా నిర్వహించారు ఆదరణ ఫౌండేషన్‌అనాథాశ్రమంలో కేక్ కట్ చేసి పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ తుమ్మల నాగేశ్వరరావు
నిండు నూరేళ్లు ఆయురారోగ్య అష్టైశ్వర్య భోగభాగ్యాలతో విలసిల్లాలని కోరుకున్నారు.కార్యక్రమంలో గద్దల శివకృష్ణ , బొక్క పుష్పారావు, గద్దల నిఖిల్ పల్లెపోగు అవినాష్ మరియు యువజన నాయకులు పాల్గొన్నారు.

మల్లు నందిని విక్రమార్క సమక్షంలో కర్లపూడి వాసు జన్మదిన వేడుకలు



వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన మల్లు నందిని..

మధిర నవంబర్15(సికె న్యూస్)కాంగ్రెస్ నాయకుడు కర్లపూడి వాసు జన్మదిన వేడుకలను తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు నందిని కర్లపూడి వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి,ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....కర్లపూడి వాసు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ, అందరి అభిమానాన్ని పొందుతూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు కర్లపూడి వాసుకు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కర్లపూడి వాసు తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించిన మల్లు నందిని అమ్మకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులకు, అభిమానులకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

గర్భాకుల రాము లు మృతదేహానికి నివాళులర్పించిన జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల రాజు



మధిర నవంబర్15(సికె న్యూస్)మధిర మండల పరిధిలోని రాయపట్నం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి గర్భాకుల రాములు (80, సం) కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతూ నిన్న మధ్యాహ్నం సమయంలో తుది శ్వాస విడిచినారు గతంలో రాములు అటెండర్ గా ప్రభుత్వ స్కూల్ ఆఫీస్ దగ్గర అధికారులు దగ్గర మంచి పేరు తెచ్చుకున్న గొప్ప వ్యక్తి పని చేసేవారు.
ఈరోజు ఉదయం రాయపట్నం గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు రాములు కొడుకు శీనువారి కుటుంబాన్ని పరామర్శించారు మరియు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ సితార్ నాగేశ్వర రావు గ్రామ సర్పంచ్ కంచం గోపి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇటుకల భాస్కర్ కుమారుడు వివాహానికి హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముండతో సుధాకర్.



మధిర నవంబర్ 15(సికె న్యూస్).
మధిర మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికల భాస్కర్ కుమారుడి వివాహమునకు హాజరైన జిల్లా కాంగ్రెస్ నాయకులు మొండితోక సుధాకర్ రావు ఖమ్మం పట్టణంలోని భాస్కర్ కుమారుడి వివాహమునకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి నిండు నూరేళ్లు సుఖశాంతులతో ఉండాలని మొండితోక సుధాకర్ రావు

గొల్లపల్లి శ్రీనివాసచారి స్వామి విజయలక్ష్మి స్వగృహం నందు అయ్యప్ప స్వామి పూజకు హాజరైన మధిర స్విమ్మర్స్



మధిర నవంబర్ 15 (సికె న్యూస్) మధిర స్విమ్మింగ్అసోసియేషన్ సహాయ కార్యదర్శి గొల్లపల్లి శ్రీనివాస్ చారి స్వామి ఇంటిలో అయ్యప్ప స్వామి పూజకు మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి మరియు సభ్యులు పూజా మరియు సద్ది కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా చల్ల సత్యనారాయణ యరమల కోటిరెడ్డి మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులు మధిర స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులందరికీ ఎల్లవేళలా ఆ స్వామి వారి దీవెనలు కావాలని సభ్యులందరూ అయ్యప్ప స్వామి వారిని వేడుకున్నారు
మధిర స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చుక్క రాంబాబు స్వామి గౌరవ సలహాదారు రంగిశెట్టి శ్రీనివాసరావు స్వామి ఉపాధ్యక్షులు గండూరి రాంబాబు స్వామి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు
ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యక్షులు లింగంపల్లి అప్పారావు కోశాధికారి శీలం శ్రీనివాసరెడ్డి అలా ప్రసాద్ బజాజ్ సాంబిరెడ్డి వేమిరెడ్డి పిచ్చిరెడ్డి(ఫైర్) కె ఎన్ రాజు చావ అప్పారావు శ్వేత తదితరులు పాల్గొన్నారు

నేడు పిల్లల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా "పిల్లల ప్రజావాణి" కార్యక్రమం...

జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :నేడు (సోమవారం) పిల్లలు, ముఖ్యంగా బలహీన, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వారి హక్కులకు సంబంధించిన అంశాలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చేందుకు పిల్లల ప్రజావాణి కార్యక్రమం ఒక ప్రత్యేక వేదికగా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
పిల్లల ప్రత్యేక ప్రజావాణి సందర్భంగా పిల్లల భద్రత, రక్షణ, విద్య, ఆరోగ్యం, పోషణ, అభివృద్ధి, బాలల హక్కులకు సంబంధించిన సమస్యలు స్వీకరించి, సంబంధిత శాఖలకు పంపి సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. పిల్లల ప్రజావాణి కార్యక్రమం కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయబడుతుందని, కార్యక్రమంలో పిల్లలకు సురక్షితమైన, స్నేహపూర్వకమైన వాతావరణం కల్పిస్తూ, వారి గౌరవం, గోప్యత కు పూర్తి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు .సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలకు సంబంధించిన సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ ఫిర్యాదులు, సమస్యలను నేడు కలెక్టరేట్, ఖమ్మంలో నిర్వహించే పిల్లల ప్రజావాణి ప్రత్యేక డెస్క్‌లో తెలియజేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ప్రారంభం -- సీనియర్ సిటిజన్ పాఠకులకు సన్మానం



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎండీ ఖాదర్ బాబా ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రంథాలయానికి విశేష సేవలు అందిస్తూ, నిరంతరం పుస్తక పఠనాన్ని కొనసాగిస్తున్న సీనియర్ సిటిజన్ పాఠకులను చైర్మన్ ఘనంగా సన్మానించినారు. అనంతరం పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు బుక్ రీడింగ్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు, పుస్తకాల ప్రాధాన్యత, రచయితల ఆలోచనలు, విజ్ఞానాభివృద్ధిపై బుక్ టాక్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ శ్రీ సి. మల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు శ్రీ బాబు, శ్రీ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ శ్రీ పి. సంతోష్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

జీవితంలో సరైన దారి చూపించేవి పుస్తకాలే....



పసునూరి రాజేంద్రప్రసాద్ జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి..

సికె న్యూస్ నవంబర్ 15 మహబూబాబాద్ జిల్లా (పతినిధి: దుర్గం మురళి మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంధాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి లిముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి (డిపిఆర్ఓ) పసునూరి రాజేంద్రప్రసాద్ పుస్తకప్రదర్శన ను ప్రారంభించారు.ఈ..సందర్భంగా డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్పర్ధయ వర్ధతే విద్య, అని చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ ఒక మంచి పుస్తకాన్ని మాత్రం కొనుక్కోవాలనే మహానుభావుల మాటలను గుర్తు చేసారు. జీవితంలో సరైన దారి చూపించేవి పుస్తకాలు మాత్రమే అని అన్నారు ఈ..కార్యక్రమంలో లైబ్రేరియన్లు జి. విజేందర్, రుద్రారపు వీరేందర్, సిబ్బంది బొడ్డుపల్లి భూలక్ష్మి, బి. యాదమ్మ గ్రంథాలయ పాఠకులు హరిలాల్, ఆర్ సి. విజ్ఞాన్, అనూప్ సూరజ్, మౌనిక ,కవిత, సరిత పుస్తక ప్రియులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వంతో బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన కోరం ఉమా -- సురేందర్



సీకే న్యూస్ ప్రతినిధి ఇల్లందు(జి కళ్యాణ్) నవంబర్ 15.భద్రాద్రి కొత్తగూడెం /జిల్లా టేకులపల్లి మండలం బేతంపూడి స్టేజి వద్ద ఇటీవల జరిగిన టపాసుల ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, శరీరం కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి, ఖదీఖ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులను కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం. ఉమా -- సురేందర్ పరామర్శించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పిస్తూ, వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రమేష్ కుమారుడి వైద్య ఖర్చుల కోసం రూ. 10,000 , నరేష్ కుమారుడి వైద్య ఖర్చుల కోసం రూ. 20,000 చొప్పున మొత్తం రూ 30,000 ఆర్థిక సహాయం అందించారు.
ప్రమాదంలో గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెప్పి, చేతనైన సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకున్న కోరం. ఉమా -- సురేందర్,


శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి విచ్చేసిన శ్రీమతి మల్లు నందిని విక్రమార్క వారికి ఘనంగా స్వాగతం పలికిన దేవాలయ చైర్మన్ వంగవేటి రాజశేఖర్



మధిర నవంబర్ 15(సికె న్యూస్) శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి మల్లు నందిని విక్రమార్క స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ వంగవేటి రాజశేఖర్, కమిటీ సభ్యులు బహటం వనజ, పిల్లల మర్రి ధనలక్ష్మి మరియు మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన

పలు శుభ కార్యక్రమాలకు హాజరు



సికె న్యూస్ ప్రతినిధి :ఖమ్మం/కూసుమంచి/ఏదులాపురం/ఖమ్మం రూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. తొలుత ఉదయం కూసుమంచి మండలం నేలపట్ల గ్రామంలో శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి పోతురాజు దేవాలయ విగ్రహం యంత్ర ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై.. యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖమ్మ రూరల్ మండలం రెడ్డిపల్లిలో వేర్వేరు ఫంక్షన్ హాల్ లలో నిర్వహించిన.. ఇటికాల భాస్కర్ కుమారుడి వివాహ వేడుకకు, ఖమ్మం రూరల్ మండలం కస్నాతండాకు చెందిన అవిరేణి రవి (లేటు) కుమారుడి వివాహానికి, ఏఆర్ ఫంక్షన్ హాల్లో కడారి వారి వివాహ వేడుకకు వెళ్లి.. ఆశీర్వదించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వరంగల్ క్రాస్ రోడ్ కు చెందిన సమ్మెట శేఖర్ కుమారుడి వివాహ వేడుకకు, ఖమ్మంలో సీనియర్ పాత్రికేయులు మైసా పాపారావు కుమార్తె వివాహ వేడుకకు, గాంధీచౌక్ వాస్తవ్యులు దేవరశెట్టి రామారావు కుమారుడి పెళ్లి వేడుకకు, అలాగే నగరంలో వేముల లక్ష్మణరావు కుమార్తె వివాహ వేడుకకు, ఖమ్మంలో మాజీ కార్పొరేటర్ నాగుల్ మీరా ఇంట్లో ఓ శుభ కార్యక్రమానికి వెళ్లి..హోటల్ అశోక లో జరిగిన వేడుకకు వెళ్లి ఆశీర్వదించారు. నూతన వస్త్రాలు అందించి దీవించారు. ఆయా కార్యక్రమాల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, పలువురు సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమం జోడెడ్లుగా కాంగ్రెస్ పాలన

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు.. ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- గత పాలకులు పింఛన్లు, రేషన్ కార్డులను, పేదోడి గూటిని పట్టించుకోలేదు
- కాళేశ్వరం పేరుతో.. కమీషన్ల పాలన చేసింది
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- తిరుమలాయపాలెం మండలంలో కొత్తగా 1,123 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ



సికె న్యూస్ ప్రతినిధి తిరుమలాయపాలెం: అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి కొత్తగా మంజూరైన 1,123 చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను కలెక్టర్ దివాకర్ టీఎస్, కాంగ్రెస్ నేతలతో కలిసి మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించారని, పింఛన్లు, రేషన్ కార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై క్వింటాకు రూ.500 బోనస్, కొత్త రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు మంజూరు చేస్తూ అండగా నిలుస్తున్నామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.40 వేల కోట్లు

మొదటి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, హైదరాబాద్‌లో పేదలకు మరో లక్ష ఇళ్లు కేటాయించామని మంత్రి వెల్లడించారు. ఈ నెలాఖరులోగా తుది బిల్లు మంజూరు చేస్తామని తెలిపారు. మొత్తం రూ.40 వేల కోట్లతో ఎనిమిది లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయనున్నామని, మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

పాలేరు నియోజకవర్గంలో అదనంగా 5,279 పింఛన్లు

తిరుమలాయపాలెం మండలంలో ఇప్పటికే 9,024 మందికి నెలకు రూ.2.99 కోట్ల పింఛన్లు అందుతున్నాయని, తాజాగా మరో 1,123 మందికి రూ.38.76 లక్షల విలువైన పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 37,039 మందికి రూ.8.69 కోట్ల పింఛన్లు అందుతుండగా, తాజాగా మరో 5,279 మందికి రూ.1.43 కోట్ల పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.
నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీలో 968, కూసుమంచి మండలంలో 1,126, ఖమ్మం రూరల్ మండలంలో 882, నేలకొండపల్లి మండలంలో 1,175, తిరుమలాయపాలెం మండలంలో 1,123 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రూ.26 కోట్లతో 100 పడకల ఆసుపత్రి, రూ.46 కోట్లతో ఐటీఐ కళాశాల నిర్మాణ పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గ్రామాల్లో సీసీ రహదారులు నిర్మించడంతోపాటు డొంకలు, మట్టి రహదారులను తారు రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన వైద్య, విద్యా సదుపాయాలు కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్, ఆత్మ కమిటీ పాలేరు నియోజకవర్గ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనజాతీయ గౌరవ్ దివాస్ మరియు బిర్సా ముండా జయంతి వేడుకలు



సీకే న్యూస్ ప్రతినిధి ఇల్లందు. (జి కళ్యాణ్) నవంబర్ 15.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గం గార్ల మండలం సీతంపేట గ్రామంలో ఇల్లందు నియోజకవర్గ బిజెపి ఆదివాసీ నాయకులు గుండెబోయిన నాగమణి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆదివాసుల ఆత్మగౌరవ ప్రతీక అయిన భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి సందర్భంగా ఆ మహనీయునీ చిత్రపటానికి పూల మాలలతో నివాళులు అర్పించి ఘనంగా జాతీయ ఆదివాసీ గౌరవ్ దివాస్ ను నిర్వహించటం జరిగింది.
ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ బిర్సా ముండా కేవలం 25 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆదివాసీ హక్కుల కోసం అస్థిత్వం కోసం, భూమి కోసం , వెట్టిచాకిరికి వ్యతిరేకంగా మరియు అటవీ హక్కుల కోసం అబువా దిషుమ్ – అబువా రాజ్ (మా భూమి.. మా పాలన) అనే నినాదంతో ఆదివాసులను ఏకం చేసి బ్రిటీష్ ప్రభుత్వంపై 1899లో గెరిల్లా పోరాటాన్ని నడిపి, 1900 జూన్ 9న తన 25వ ఏట విరమరణం పోందిన గోప్ప ఆదివాసీ యోధుడని కోనియాడారు.ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుల ప్రాణ త్యాగాలను మరియు ఆదివాసీ సంస్కృతిని, హక్కులను స్మరిస్తూ బిర్సా ముండా పుట్టిన రోజును నవంబర్ – 15ను ఆదివాసి జాతీయ గౌరవ్ దినోత్సవంగా మోడి ప్రభుత్వం 2021 నవంబర్ 15న దీనిని అధికారికంగా ప్రకటించి ఆదివాసీ సమాజానికి గోప్ప గౌరవం కల్పించారు అని చెప్పటం జరిగింది.
ఈ కార్యక్రమంలో సీతంపేట ఆదివాసీ నాయకులు బోర్ర శ్రీరాములు ,మోకాళ్ళ సాయి ,అర్రెం నర్సయ్య,వీరన్న ,శేఖర్ ,శ్రీలత, స్రవంతి,కుంజ అబ్బమ్మ,శారద, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్, ఆకుల సిద్ధిరాములుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఘన నివాళులు,



(సీ కే న్యూస్) చేగుంట చేగుంట మాజీ జడ్పీటీసీ ఆకుల సిద్ధిరాములు మృతి పట్ల దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆకుల సిద్ధిరాములు ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని, రాజకీయాల్లో ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన మృతి చేగుంట ప్రాంతానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

భారత్ సమ్మిట్ పేరుతో రాష్ట్ర ప్రజాధనాన్ని వృథా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం -- బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్



సికె.న్యూస్. అదిలాబాద్:హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్‌కు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదిలాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ గారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజల సంక్షేమం, అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మిట్‌ల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.రాజకీయ ప్రచారాలకు, ఆర్భాటపు కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం కాకుండా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల పన్నుల రూపంలో ప్రభుత్వానికి చేరుతున్న ప్రతి రూపాయి ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి ఉపయోగపడాలని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రజల ఆర్థిక ప్రయోజనాలు, అభివృద్ధి అంశాలపై సమాధానం చెప్పాలని, సమ్మిట్ నిర్వహణకు అయిన ఖర్చులు, వాటి వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని పతంగే బ్రహ్మానంద్ డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇస్తోందని బీజేపీ నాయకులు విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలు, ప్రజాధన వినియోగంపై తమ పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదిలాబాద్ జిల్లా బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

వాజేడులో 151వ బిర్సా ముండా జయంతి వేడుకలు



ఆదివాసీ చట్టాల అమలు కోసం పోరాటం
కొనసాగిస్తామన్న ఆదివాసీ నవనిర్మాణ సేన

సీకే న్యూస్, వాజేడు మండల ప్రతినిధి, షేక్ రహీమ్ :వాజేడు మండల కేంద్రంలో ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో ధర్తీ ఆబా బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ఆదివాసీ నవనిర్మాణ సేన సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ అధ్యక్షతన జరిగింది. ముందుగా నాయకులు బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆదివాసీ నవనిర్మాణ సేన ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ, బిర్సా ముండా 1875 నవంబర్ 15న జార్ఖండ్ రాష్ట్రం, కుంటి జిల్లా, ఉలీహతు గ్రామంలో జన్మించారని తెలిపారు. కేవలం 25 ఏళ్ల వయసులోనే ఆదివాసీల కోసం ప్రాణాలు అర్పించిన మహాయోధుడని కొనియాడారు.బ్రిటీష్ పాలన, జమీందారీ వ్యవస్థ, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా 1899–1900లో బిర్సా ముండా నడిపిన ఉద్యమాన్నే “ఉల్గులాన్” అని పిలుస్తారని ఆయన వివరించారు. ఆ పోరాట ఫలితంగానే 1908లో చోటా నాగపూర్ కౌలుదారీ చట్టం వచ్చిందని, దీని వల్ల గిరిజనుల భూములకు రక్షణ లభించిందని అన్నారు.బిర్సా ముండా 1900 జూన్ 9న రాంచీ జైలులో మరణించినా, ఆయన ఆశయాలు నేటికీ ఆదివాసీలకు స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. ఆయన జయంతిని కేంద్ర ప్రభుత్వం “జన్ జాతీయ గౌరవ్ దివస్” గా జరుపుతోందని గుర్తు చేశారు.ప్రస్తుతం 5వ షెడ్యూల్, పీసా చట్టం – 1996, అటవీ హక్కుల చట్టం – 2006 సరిగ్గా అమలు కావడం లేదని, బిర్సా ముండా స్ఫూర్తితో ప్రతి గూడెంకు వెళ్లి ఆదివాసీలను చైతన్యపరిచి, చట్టాల అమలు కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, ఆదివాసీ నవనిర్మాణ సేన వాజేడు మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్, నాయకులు పాయం శివాజి, నాగలక్ష్మి, ఉయిక పార్వతి, ఉయిక సత్యబాబు, ఉయిక రమేష్, బొగ్గుల సూరిబాబు, ఉయిక శివ, పాయం శశిధర్, జెస్సిత, అభిజ్ఞాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి.1/70 చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఐ= కేసుల తీర్పులను తక్షణమే అమలు చేయాలి

సి కె న్యూస్ ప్రతినిధి ఇల్లందు. (జి కళ్యాణ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. ఇల్లందు మండలం బోజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సమ్మక్క--సారలమ్మ గుడి వద్ద ఆదివాసి సంక్షేమ పరిషత్ ఇల్లందు మండల కమిటీ అత్యవసర సమావేశం అయ్యారు మండల అధ్యక్షులు ఈసాల రామచందర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఉపాధ్యక్షులు ఊకె చైతన్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చింత ఉపేందర్ పాల్గొని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల భూమి హక్కుల పరిరక్షణ కోసం ఉన్న 1/70 చట్టాన్ని అమలు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు.చట్టాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, ఆదివాసుల భూములకు సంబంధించిన ఐ= కేసుల్లో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను అమలు చేయకుండా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర ఆందోళనకరం అని అన్నారు. కోర్టు తీర్పులను అమలు చేయని అధికారులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి నిరసన తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలు నిర్వహించేందుకు త్వరలోనే జిల్లా కమిటీ కార్యాచరణ ప్రకటిస్తుందని నాయకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ సోషల్ మీడియా బాధ్యులు కిన్నెర కిషోర్,ఇల్లందు మండల ప్రధాన కార్యదర్శి ఈసం హరీష్,కుంజ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.ఆదివాసుల భూమి హక్కుల పరిరక్షణే మా లక్ష్యం
1/70 చట్టం అమలయ్యే వరకు మా పోరాటం ఆగదుఅని అన్నారు.

గంగారం మండల గిరిజన మోర్చా అధ్యక్షులుగా మోకాళ్ల సమ్మన్న ఎన్నిక



గంగారం సీకే న్యూస్,: భారతీయ జనతా పార్టీ గంగారం మండల గిరిజన మోర్చా అధ్యక్షులుగా మోకాళ్ల సమ్మన్న ఎన్నికయ్యారు.ఈరోజు బీజేపీ గంగారం మండల అధ్యక్షులు సువర్ణపాక నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా గిరిజన మోర్చా ములుగు జిల్లా అధ్యక్షులు సిద్దబోయిన సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల బాబురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చా మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

నూతన కార్యవర్గ వివరాలు:

- మండల అధ్యక్షులు: మోకాళ్ల సమ్మన్న
- ఉపాధ్యక్షులు: చుంచ కిరణ్
- ప్రధాన కార్యదర్శులు: సోలం సంతోష్, ఐలబోయిన గణేష్
- సహాయ కార్యదర్శి: ఎట్టి లక్ష్మణ్
- కోశాధికారి: బోడ సురేష్
- కార్యదర్శులు: చుంచ నరసయ్య, కురుసం ఉమాకర్

కార్యవర్గ సభ్యులు:

ఈక దిలీప్, తాటి నర్సింగరావు, ఈక నర్సింగరావు, జజ్జరి విజయ్, గుంట సాగర్, బానోత్ బాలు, వజ్జ చంద్రయ్య, సువర్ణపాక మనోహర్.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బానోత్ శివరాం, ములుగు జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గుగులోత్ స్వామి నాయక్, పార్టీ అధికార ప్రతినిధి జనగం వెంకన్న, సీనియర్ నాయకులు బుల్లి సుధాకర్, ఈక నరేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సువర్ణపాక నరేందర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా మోకాళ్ల సమ్మన్న ఎన్నికయ్యేందుకు సహకరించిన గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు సిద్దబోయిన సురేందర్, జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గం గిరిజనుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

వివాహ వేడుకకు హాజరైన మాజీ మున్సిపల్ చైర్మన్ బి ఎస్ కళావతి కేశవ్



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :రోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్ వి. ఈవెంట్.యస్.కళావతి కేశవ్‌లి మున్సిపల్ కౌన్సిలర్లు,పార్టీ సీనియర్ నాయకులు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

"చింతకాని మండలశీ, తిమ్మినేనిపాలెం ఎమ్మెస్ ఎఫ్ గ్రామ కమిటీ ఎన్నిక"



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.శ్రీ పద్మ మంద కృష్ణ మాదిగ అన్న ఆదేశానుసారం... ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్ఎఫ్ నాయకుల సమన్వయంతో...
రాష్ట్రంలో,ప్రతి జిల్లాలో, ప్రతి మండలంలో, ప్రతి మాదిగ గ్రామాల్లో...మరియు ప్రతి విద్యా సంస్థల్లో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఎం ఎస్ ఎఫ్ కమిటీ ల నియమాలు ఏర్పాటు చెయ్యాలి అని నిర్ణయించడం జరిగింది...
ఈ క్రమంలో భాగంగా ...
చింతకాని మండల, తిమ్మినేనిపాలెం గ్రామం లోని మాదిగ విద్యార్థుల సమక్షంలో... ఎం ఎస్ ఎఫ్ కమిటీ ఎన్నిక ప్రక్రియ జరిగింది.
ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు కొమ్ము నరేష్ మాదిగ అధ్యక్షతన...
చింతకాని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు నారపోగు నాగేంద్రబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షులు చిర్ర ఉపేందరావు మాదిగ, చింతకాని మండల ఎమ్మార్పీఎస్ మాజీ ప్రచార కార్యదర్శి కుక్కల దిలీప్ కుమార్ మాదిగ.. మాట్లాడుతూ... భవిష్యత్తు రోజుల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థుల సమస్యలకు ఎంఎస్ఎఫ్ పోరాడాలని పీడిత కులాల గొంతుకగా . ఎమ్మెస్ ఎఫ్ మారాలని ,అణగారిన వర్గాల విద్యార్థులకు అండగా నిలబడాలని అవసరమైతే మంద కృష్ణ మాదిగ ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడాలని పిలుపునిచ్చారు. మరియు మండల ఎమ్మార్పీఎస్ మాజీ గ్రామ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెస్ ఎఫ్ గ్రామ కమిటీలో భాగంగా ...
అధ్యక్షులు గా కొమ్ము రాజు మాదిగ, ఉపాధ్యక్షులు గా ఊటుకూరు రఘు మాదిగ, అధికారప్రతినిదిగా నాదెండ్ల అశోక్ మాదిగ, ప్రధాన కార్యదర్శి గా రాంపొంగు ఆదిత్య మాదిగ, ప్రచార కార్యదర్శి గా కొమ్ము వినోద్ మాదిగ, మరియు కమిటీ సభ్యులు:- ఉసికల నాగేశ్వరరావు మాదిగ, మర్రి చరణ్ మాదిగ, మర్రి సంతోష్ మాదిగ, మరియు మహిళా ఎం ఎస్ ఎఫ్ కమిటీ సభ్యులు:- కొమ్ము స్వాతి మాదిగ, ఉసికల స్మైలి మాదిగ, ఉసికల షైనీ మాదిగ, ఉసికల స్వీటీ మాదిగ,రాయభారపు ఆకాంక్ష మాదిగ,లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది

చెరుకూరి తోటలో ఘనంగా జరిగిన మున్నూరుకాపుల వన సమారాధన మహోత్సవం

ఈ మహోత్సవానికి పలువురు ప్రముఖులు హాజరై ఉత్తేజిత ప్రసంగాలు చేశారు





సి కే న్యూస్ ఖమ్మం.మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యాన గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి వారి మామిడి తోటలో ఆదివారం ఏర్పాటు చేసిన వన సమారాధన మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై ఉత్తేజిత ప్రసంగాలు చేశారు.ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర,మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి జోగు రామన్న,ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్,మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను,సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, కోశాధికారి కంచి సత్యనారాయణ, ప్రముఖులు ఆకుల రాజయ్య, ఎడవల్లి కృష్ణ,కొడిమ్యాల మధుసూదన్,మరిశెట్టి రాఘవయ్య,గాలి అనిల్ కుమార్,తూడి ప్రవీణ్ కుమార్,రౌతు కనకయ్య,ఎర్రా నాగేంద్ర బాబు, పగడాల మంజుల,వాసుదేవుల వెంకటనర్సయ్య,కాసా హనుమంతరావు తదితరులు ప్రసంగించారు.ఈ మహోత్సవానికి వద్దిరాజు కిషన్,రమేష్ హజారీ, ఆకుల రజిత్ కుమార్,ఊసా రఘు,కంచి సత్యనారాయణ,ఆవుల రామారావు,దిండిగల రాజేందర్,చెరుకూరి శేషగిరిరావు,బాపట్ల మురళి,వద్దిరాజు వెంకటేశ్వర్లు,భీమా శ్రీధర్, బండారు రుక్మేందర్,చందా గోపీ,రావి రాంబాబు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.ఈ వన సమారాధన మహోత్సవానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మున్నూరుకాపు కుల బాంధవులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.తెలంగాణలోని వివిధ జిల్లాలు, ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు ప్రముఖులు హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా "జై తెలంగాణ జైజై తెలంగాణ","వర్ధిల్లాలి వర్ధిల్లాలి మున్నూరుకాపుల ఐక్యత వర్ధిల్లాలి","జై బీసీ జైజై బీసీ"అనే నినాదాలు మిన్నంటాయి.

శ్రీ శ్రీ శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు హాజరైన ఎమ్మెల్యే



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల కేంద్రంలో లిశ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వేడుకలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వాల్మీకి విగ్రహానికి ఆవిష్కరించి విగ్రహానికి పూలమాలవేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది.
ఎమ్మెల్యే కి వాల్మీకి సంఘం నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు .
ఎమ్మెల్యే మాట్లాడుతూ .....
ప్రజలందరికీ,వాల్మీకి సోదరులకు వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుభాకాంక్షలు
ఆదికవి వాల్మీకి మహర్షి రామాయణం రచించారు మనం ఏదో సందర్భంలో రామాయణం గురించి ఆ సీతారాముల గురించి ప్రపంచానికి తెలియజేశారు
గ్రామాలలో వాల్మీకి విగ్రహం చేయడం గ్రామంలో ఒక పండగ వాతావరణం నెలకొంటుంది ప్రతి ఒక్కరూ భక్తి భావంతో దేవుని అనుగ్రహం ఉన్న ఉన్నప్పుడే మనం ఏ పని చేసినా ఆ పనిలో విజయం కలుగుతుంది తెలిపారు.వాల్మీకి మహర్షి ఆదర్శంగా తీసుకొని ఇద్దరు కొడుకులు ఉంటే లవ కుశలని, అన్న తమ్ములను రామ లక్ష్మణ, భార్యాభర్తలను సీతారాములనికి, పరిపాలన బాగుంటే రామరాజ్యమని ఇలా ప్రతి విషయంలో అనుక్షణం రామాయణాన్ని గుర్తు చేసుకుంటూ వాల్మీకి మహర్షిని గుర్తు చేసుకోవడం జరుగుతుంది .
ఎలినోవా ప్రభావం సరైన వర్షాలు లేక రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని అందించడం జరిగింది. వాల్మీకి మహర్షి ఆశీస్సులతో త్వరలో సకాలంలో వర్షాలు పడాలి రైతులకు మంచిగా గిట్టుబాటి ధర రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతి గ్రామాలలో రైతులు, ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వాల్మీకి మహర్షి ఆశీస్సులతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జరిగినది.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, సర్పంచు డి ఆర్ విజయ్, మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు డి. వై రామన్న, మైలగడ్డ చంద్రశేఖర్ , మల్లికార్జున్ రెడ్డి, కర్రెప్ప , రంగస్వామి, నారాయణ రెడ్డి గ్రామ వాల్మీకి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి



బాసు హనుమంతు నాయుడు

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు గద్వాల నియోజకవర్గం గట్టు మండల కేంద్రంలో గోవిందు కుమారుడు శ్రీనివాసులు వెడ్స్ మాధురి ల మరియు అయిజ పట్టణంలోని ఎస్ ఆర్ ఆర్ కన్వెన్షన్ హాల్ నందు నరసింహారెడ్డి కుమారుడు వినీత్ కుమార్ రెడ్డి వెడ్స్ శాన్విక ల వివాహ వేడుకల్లో పాల్గొని,నూతన వధూవరులను ఆశీర్వదించి, హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.....
వీరి వెంట,జయసింహ రెడ్డి, ఎస్.రాము నాయుడు, లక్ష్మీకాంత్ రెడ్డి,బాసు గోపాల్, శేఖర్ నాయుడు,కంగారు తిమ్మప్ప, రొల్ల కృష్ణ,మద్దిలేటి,బాసు బొజ్జయ్య నాయుడు,హరి,గురు,నరసింహులు,వినయ్,రాము,రమేష్,తివ్మప్ప,రాముడు, వీరేష్,మల్లికార్జున్,మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు...

ప్రతి క్రీడాకారులు గెలుపు ఓటమి సమానంగా స్వీకరించాలి ...

బిబిఆర్ ప్రీమియర్ లీగ్ సీజన్ -4 ముగింపు క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్న ఎమ్మెల్యే .



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని దౌదర్ పల్లి ఔటర్ రింగ్ రోడ్డులోని క్రీడా ప్రాంగణంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఁ కౌన్సిలర్ బాబర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బి బిఆర్ ప్రీమియర్ లీగల్ సీజన్ -4 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి క్రికెట్ క్రీడలో గెలుపొందిన మొదటి, ద్వితీయ తృతీయ టీమ్ లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రోఫీ ని నగదు బహుమతి ని క్రీడాకారులకు అందజేయడం జరిగింది..
ఎమ్మెల్యే కి బాబర్ , క్రీడాకారులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు .
ఎమ్మెల్యే మాట్లాడుతూ .....
ప్రస్తుతం యువత చదువుతోపాటు క్రీడారంగంలో కూడా నైపుణ్యత పొంది ఉండాలని అని తెలిపారు.
క్రీడలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, శారీరకంగా మానసికంగా దృఢత్వాన్ని కలిగిస్తాయని, ప్రతి ఒక్కరు ఆటలు ఆడాలని కోరారు, క్రీడలను ప్రోత్సహిస్తున్న చాలా సంతోషంగా హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో, ఐ పీ ఎల్ కూడా తమ నైపుణ్యతను ప్రదర్శించి గద్వాల ప్రాంతానికి మంచి పేరు ప్రతిష్టలు వచ్చే విధంగా ప్రతి ఒక్క క్రీడాకారు కృషి చేయాలని కోరారు.
గెలుపు ఓటమి సమానంగా స్వీకరించారు .
ఓటమి విజయానికి నాంది తెలిపారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వైస్ చైర్మన్ శంకర్, మాజీ కౌన్సిలర్స్ తుమ్మల నరసింహులు యాదవ్ ,మురళి, ఇసాక్ నాయకులు వంట భాస్కర్ , మధు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో నూతన గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే ....



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు గద్వాల నియోజకవర్గం గద్వాల మండలం పరిధిలో గోనుపాడు గ్రామం డబల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు శివకుమార్ నూతన గృహప్రవేశానికి కార్యక్రమం ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి లి హాజరయ్యారు. గోన్పాడు గ్రామంలో ఇంద్రమ్మ ఇల్లు ఇళ్ల ను మంజూరు లబ్ధిదారులు అజిత్ ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు ..
ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన గృహాన్ని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది . ఎమ్మెల్యే కి ఇంటి యజమాని జబీబుల్లా శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు .
ఎమ్మెల్యే మాట్లాడుతూ ....
ముందుగా నూతన గృహప్రవేశాన్ని చేసిన లబ్ధిదారులకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.గోనుపాడు గ్రామంలో డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి అని తెలిపారు.భవిష్యత్తులో ఈ ప్రాంతాన్ని అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, జిల్లా సర్పంచులు మాజీ అధ్యక్షులు మజీద్, నాయకులు మైలగడ్డ గద్ద చంద్రశేఖర్ ,కన్నా, నారాయణ రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం నాయకత్వంలో నెరవేరినది




కె. టి దొడ్డి మండలం ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు గద్వాల నియోజకవర్గం కె. టి దొడ్డి మండలం పరిధిలోని సుల్తానాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లిఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.
సుల్తానాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు లింగప్ప .
నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది .
నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు .
ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ ....
నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది.
గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు.
లిఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరపున ధన్యవాదాలు .....
ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ...
ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం కి మంత్రి కి మా ఎమ్మెల్యే కి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయం మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్ , మాజీ ఎంపీపీ విజయ్ , మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సర్పంచులు కావేరి మల్లికార్జున్, , తిక్కన్న నాయకులు ఉరుకుందు, మైలగడ్డ చంద్రశేఖర్, , నారాయణ రెడ్డి , , వీరేష్, దినేష్ గౌడ్, కృష్ణుడు, చిన్నారెడ్డి హట్టి మల్లేష్, అంబ్రేష్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో ఘనంగా ఛట్ పూజ వేడుకలు

సూర్య భగవానుడు, ఛతీ మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి
మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్



షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు సీకే న్యూస్ ప్రతినిధి నవంబర్ 15 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలో సూర్య భగవానుడు, ఛతీ మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఆకాంక్షించారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని మాందోని మైసమ్మ వద్ద నిర్వహించిన ఛట్ పూజ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కఠినమైన ఉపవాస దీక్షలు, సూర్య భగవానుడికి ప్రత్యేక ప్రార్థనలు, ప్రకృతి పట్ల కృతజ్ఞతా భావం చాటిచెప్పే ఛట్ పూజ భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని సూర్య భగవానుడు, ఛతీ మాతను ప్రార్థించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రవి నాయక్, సిటీ కేబుల్ వెంకటేష్, మేకల రాఘవేందర్ యాదవ్, బాలు, బ్యాంకు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో ఘనంగా ఛఠ్ పూజ వేడుకల



సూర్య భగవానుడికి భక్తుల ప్రత్యేక పూజలు..
ఇతర రాష్ట్రాల ప్రజలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్ సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 15 : షాద్‌నగర్: సూర్య భగవానుడి ఆరాధనకు ప్రతీకగా నిలిచే ఛఠ్ పూజ వేడుకలు షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన,ప్రజల,సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.ఈ వేడుకలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి షాద్‌నగర్‌లో నివసిస్తున్న ప్రజల ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ వారితో కలిసి ఛఠ్ పూజ వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులతో ఆప్యాయంగా మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.నాలుగు రోజుల పాటు అత్యంత నిష్ఠతో నిర్వహించే ఛఠ్ పూజలో భాగంగా నహాయ్ ఖాయ్, ఖర్నా, అస్తమించే సూర్యుడికి అర్ఘ్యం, ఉదయించే సూర్యుడికి అర్ఘ్యం సమర్పించడం వంటి సంప్రదాయ ఆచారాలను భక్తులు పాటిస్తారు. సూర్య భగవానుడిని ఆరాధిస్తూ నిర్జల ఉపవాస దీక్షలు చేపట్టడం ఈ పండుగ ప్రత్యేకత.వివిధ ప్రాంతాలు, రాష్ట్రాలకు చెందిన ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను,కాపాడుకుంటూ స్థానికులతో కలిసి పండుగలు జరుపుకోవడం ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోంది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కౌన్సిలర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఛఠ్ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

హాజరైన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్



షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 15 : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరులో ప్రకృతి మాతను, సూర్య భగవానుడిని ఆరాధించే అత్యంత పవిత్రమైన పండుగ ఛఠ్ మహాపర్వ్ అని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఛఠ్ పూజ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ.. సూర్యారాధనకు ప్రతీకగా నిలిచే ఛఠ్ మహాపర్వ్ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశవిదేశాల్లో స్థిరపడిన కోట్లాది మంది భక్తులు ఈ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని తెలిపారు.నదులు, జలాశయాల వద్ద ప్రత్యేక ఘాట్‌లను ఏర్పాటు చేసి, సూర్యోదయం, సూర్యాస్తమయ వేళల్లో సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించడం ఈ పండుగలో ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మాదారం నర్సింహులు గౌడ్, సోమ్లా నాయక్, జె. శ్రీనివాస్ గౌడ్, సిటీ కేబుల్ వెంకటేష్, శివచారి, జంగగళ్ల అనిల్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్పంచ్ అభ్యర్థిగా కూండ్రపు శ్రీరామమూర్తి నామినేషన్ దాఖలు.



పరవాడ, సి కె న్యూస్ ప్రతినిధి నవంబర్ 15: మండలంలోని నాయుడుపాలెం గ్రామ పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూండ్రపు శ్రీరామమూర్తి ఆదివారం భారీ ర్యాలీతో తరలివచ్చి పంచాయతీ కార్యాలయంలో ఎలక్షన్ రిటర్నింగ్ అధికారికి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ నామినేషన్‌ను సర్పంచ్ అభ్యర్థిని పైల రమణారావు ప్రతిపాదించారు.ఈ సందర్భంగా నాయుడుపాలెం మాజీ సర్పంచ్ (లేటు) కూండ్రపు సన్యాసి నాయుడు తనయుడు రాజీవ్ అభ్యర్థి వెంట ఉండి నామినేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయించారు. అలాగే పంచాయతీ పరిధిలోని మొత్తం 12 వార్డులకు గాను, సర్పంచ్ అభ్యర్థి తరఫున 12 మంది వార్డు సభ్యులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు.ఈ సందర్భంగా కూటమి సర్పంచ్ అభ్యర్థి కూండ్రపు శ్రీరామమూర్తి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తనకు ఒక అవకాశం కల్పించాలని కోరారు. ప్రజల ఆశీస్సులు, మద్దతుతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పైల మహాలక్ష్మి, పైల అప్పల నాయుడు, పరవాడ మండల టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారు సన్యాసి నాయుడు, కె. గంగు నాయుడు, రాజన సత్యారావు, కూండ్రపు నరసింహమూర్తి, కూండ్రపు పంజాబ్ అప్పలనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కూండ్రపు కన్నంనాయుడు, కూండ్రపు తాతబాబు, కె. సన్నీ బాయ్, రొంగలి గంగరాజు, ఎమ్. అప్పలనాయుడు, కె. హరి, సి. హెచ్. ముత్యాలనాయుడు, వి. నర్సింహామూర్తి, కన్నూరు సత్యనారాయణ, పైల రమణకుమారి, కె. రామకృష్ణ తదితరులతో పాటు భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు, పెద్దలు, అభిమానులు మరియు మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన వాల్మీకి మహర్షి ఆలయ ప్రారంభోత్సవం ఉ విగ్రహావిష్కరణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ
జడ్పీటీసీ,బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు శ్యామల హనుమంతు నాయుడు



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల : ఈరోజు గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల కేంద్రంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి ఆలయ ప్రారంభోత్సవం ఉ విగ్రహావిష్కరణ మహోత్సవంలో పాల్గొని,వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలవేసి,కొబ్బరికాయ కొట్టి,హోమం కార్యక్రమంలో పాల్గొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు.... అనంతరం,బాసు శ్యామల హనుమంతు నాయుడు ని వాల్మీకి కమిటీ సభ్యులు శాలువలతో ఘనంగా సత్కరించారు....అంతకుముందు, బి బాసు శ్యామల హనుమంతు నాయుడు ను వాల్మీకి కమిటీ సభ్యులు ఉ నాయకులు వైయస్సార్ చౌక్ నుంచి వాల్మీకి ఆలయం వరకు చిన్నారుల కోలాటాలతో ఉ డోలు మేళాలతో బాణాసంచా కాలుస్తూ,పెద్ద ఎత్తున స్వాగతం పలికారు....

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆయన పట్ల ప్రజలకు ఉన్న గౌరవానికి, ఆయన ఆదర్శాలను భావితరాలకు పరిచయం చేయాలనే సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు....వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ సందర్భంగా ధరూర్ మండల కేంద్రంలో పండగ వాతావరణం నెలకొన్నది అని అన్నారు..ఆదికవి మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.వాల్మీకి మహర్షి బోధించిన ధర్మం, సత్యం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమాజంలో అందరికీ గౌరవం, సమాన అవకాశాలు, ఆత్మగౌరవంతో జీవించే హక్కు కల్పించాలనే భావనను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.... మహర్షి వాల్మీకి జీవితం,ఆయన రచించిన రామాయణం భావితరాలకు నిరంతరం స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు....ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, అల్లపాడు ప్రతాప్,శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయులు,కోటేష్, లక్ష్మీకాంత్ రెడ్డి,రాజారెడ్డి,వెంకటేష్ నాయుడు,సర్పంచులు,పార్టీ శ్రేణులు ఉ వాల్మీకి కమిటీ సభ్యులు, నాయకులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.....

నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

బాసు హనుమంతు నాయుడు




సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల ఈరోజు గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలోని కుమ్మరి వీధిలో కుమ్మరి బుచ్చన్న నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని, ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొని, శుభాకాంక్షలు తెలిపారు....

అనంతరం, బాసు హనుమంతు నాయుడు ని ఇంటి యజమాని శాలువా కప్పి, సత్కరించారు....ఈ కార్యక్రమంలో మిట్టదొడ్డి సర్పంచు భర్త శేఖర్, తిరుమలేష్,శేఖర్ నాయుడు,తిమ్మప్ప గౌడ్, మద్దిలేటి, మాలిక్, పరశురాముడు,అరవిందు, వీరేష్, రాజు, నరసింహులు, గోవిందు, అంజి, వెంకటేష్, రాము,మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు....

2లక్షల 50 వేల రూపాయలు ఎన్ ఓ సి లెటర్ ను అందజేసిన గద్వాల ఎమ్మెల్యే



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల : ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ధరూర్ మండల కేంద్రానికి చెందిన కుర్వ నర్సింహులు గా/శి గాలన్న కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 2లక్షల 50వేల రూపాయల ఎల్ ఓ సి లెటర్ ను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేయడం 2లక్షల 50 వేల రూపాయలు ఎల్ ఓ సి లెటర్ ను అందజేసిన గద్వాల ఎమ్మెల్యే ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ధరూర్ మండల కేంద్రానికి చెందిన కుర్వ నర్సింహులు గా/శి గాలన్న కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 2లక్షల 50వేల రూపాయల ఎల్ ఓ సి లెటర్ ను లిగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్, కౌన్సిలర్ బాబర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్, కౌన్సిలర్ బాబర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్ నీల్ హారర్ థ్రిల్లర్ '418'ను థియేటర్లలో మిస్సయ్యారా?

టాలీవుడ్ టాప్ బ్యానర్లలో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం 418 . హారర్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో పతంగ్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఇంటర్నెట్, సోషల్ మీడియా పర్సనాలిటీ ప్రీతి వగడాల లీడ్ రోల్‌లో నటించగా.. చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన ఈ మూవీని కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేశారు. అక్టోబర్ 26న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై ఈ చిత్రానికి మిక్స్‌డ్ రివ్యూస్ రాబట్టుకుంది. అయితే థియేటర్లలో ఈ సినిమాను మిస్సయిన వారి కోసం ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. 418 ఇక ఓటీటీలోనూ సందడి చేయనుంది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో నవంబర్ 19 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ పలు ప్రధాన భారతీయ భాషల్లో అందుబాటులో ఉండనుంది. మరి ఓటీటీలో ఈ చిత్రానికి ఎలాంటి స్పందన వస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రం సూర్య రాజ్, శషాంక్ పాటిల్, రమేశ్ ఇందిర ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. దినేశ్ దినకరన్, సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన ఈ చిత్రానికి వెంకీ జీజీ మ్యూజిక్ కంపోజర్‌గా వ్యవహరించాడు.

ప్రశ్నిస్తే.. రాజకీయ ముద్ర వేస్తారా?



విశాఖపట్నంలో పట్టణీకరణ పేరుతో కొండలను తవ్వుతుండటంపై టాలీవుడ్ హీరోయిన్ చాందిని చౌదరి ఇటీవల ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. అయితే ఆమె అభిప్రాయంపై కొందరు నెటిజన్లు విమర్శలు, ట్రోల్స్‌కు దిగారు. ఈ నేపథ్యంలో తాజాగా చాందిని ఓ వీడియోను విడుదల చేస్తూ ట్రోలర్స్‌కు తనదైన శైలిలో సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు ఉండాలి. మనకు బాధ కలిగించే విషయం ఏదైనా జరిగినప్పుడు మర్యాదపూర్వకంగా, గౌరవంగా మన ఆలోచనలను, భావోద్వేగాలను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉండాలి. ఒక సాధారణ పౌరురాలిగా తన అభిప్రాయాన్ని వెల్లడిస్తే దానికి రాజకీయ రంగు పులమడం సరికాదు. గతంలో జరిగినా.. ప్రస్తుతం జరుగుతున్నా.. ఏ విషయంపైనైనా పౌరులుగా స్పందించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఒకరి అభిప్రాయాలను తమకు అనుకూలంగా మార్చుకుని, రాజకీయ అనుబంధాలు అంటగడుతూ విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదు' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

సోనాక్షి సిన్హా మార్ఫింగ్ ఫొటోల వివాదం.. నిందితుడికి ఊరటనిచ్చిన ముంబై కోర్టు

నటి సోనాక్షి సిన్హా మార్ఫింగ్ ఫోటోల కేసులో ఢిల్లీలో అరెస్టయిన ఆర్యన్ దీపక్ జైన్‌ను ముంబై కోర్టు విడుదల చేసింది. సరైన అరెస్ట్ నిబంధనలు, బీఎన్ఎస్ఎస్ చట్ట నిబంధనలను పోలీసులు పాటించకపోవడంతో ఈ అరెస్ట్ అక్రమమని మేజిస్ట్రేట్ స్పష్టం చేసింది. సోనాక్షి సిన్హా ఫిర్యాదు మేరకు ముంబైలోని బాంద్రా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, పోలీసులు ఢిల్లీలోని షహద్రా ప్రాంతంలో ఆర్యన్ దీపక్ జైన్‌ను అదుపులోకి తీసుకుని ముంబైకి తీసుకువచ్చారు. అయితే, నిందితుడిని ముంబైకి తీసుకువచ్చే ముందు ఢిల్లీలోని స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చడంలో పోలీసులు విఫలమయ్యారని కోర్టు గుర్తించింది. ఏడు సంవత్సరాల వరకు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(1)(ఎ) ప్రకారం తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను, అరెస్ట్ కారాణాన్ని నమోదు చేయడంలో దర్యాప్తు అధికారులు విఫలమయ్యారని న్యాయస్థానం పేర్కొంది. కేవలం దర్యాప్తు అవసరం అనే సాకుతో చట్టపరమైన రక్షణలను విస్మరించి ఎవరినీ నిర్బంధించలేమని తేల్చిచెప్పిన మేజిస్ట్రేట్, నిందితుడిని తక్షణమే విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.





అల్లు అర్జున్ నుంచి 'రాకా' అప్‌డేట్స్ వస్తాయా అభిమానుల్లో భారీ అంచనాలు!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇప్పటివరకు చాలా గోప్యంగా ఉంచుతున్నారు. దీంతో బన్నీ అభిమానులు ఎప్పుడెప్పుడు కొత్త అప్‌డేట్స్ వస్తాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా అల్లు అర్జున్ పాల్గొనబోతున్న ఓ సినిమా ఈవెంట్‌పై అందరి దృష్టి పడింది. తాజాగా అల్లు అర్జున్ హైదరాబాద్‌లో జరగనున్న 'ఆకాశంలో ఒక తార' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ఐకాన్ స్టార్ ఏం మాట్లాడబోతున్నారు? సినిమాకు సంబంధించి ఎలాంటి విశేషాలు పంచుకోబోతున్నారు? అనే ఆసక్తి నెలకొంది. అయితే ఈ ఈవెంట్‌కు హాజరవుతున్న బన్నీ నుంచి తమ అభిమాన చిత్రాలకు సంబంధించిన అప్‌డేట్స్ కూడా వస్తాయని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ముఖ్యంగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రాకా' సినిమా గురించి అల్లు అర్జున్ ఏదైనా కీలక విషయం వెల్లడిస్తారా? షూటింగ్‌కు సంబంధించిన విశేషాలను పంచుకుంటారా? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా'పై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై సినీ అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. అట్లీ తన సినిమాల్లో చూపించే గ్రాండ్ విజువల్స్, భారీ యాక్షన్ సన్నివేశాలు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు ఆయన అల్లు అర్జున్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో అల్లు అర్జున్ పూర్తిగా నిమగ్నమై ఉన్నారు. అయితే కథ, పాత్రలు, ఇతర నటీనటుల వివరాల విషయంలో చిత్ర బృందం పెద్దగా సమాచారం బయటకు వెల్లడించడం లేదు. దీంతో అభిమానులు ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు అల్లు అర్జున్ తదుపరి ప్రాజెక్ట్ 'ఏఏ23'పై కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కోలీవుడ్ దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో బన్నీ ఈ సినిమా చేయబోతుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. లోకేష్ తనదైన యాక్షన్ కథలు, ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్‌తో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ కలయికలో ఎలాంటి సినిమా రాబోతోంది? ఇది పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందా? అనే ప్రశ్నలు అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో 'ఏఏ23' గురించి కూడా బన్నీ ఏదైనా ఆసక్తికరమైన విషయం వెల్లడిస్తారని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.